క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సంస్కృతోన్నత పాఠశాలలో పొలంబడి



విత్తనాలు నాటుతున్న విద్యార్థులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో శుక్రవారం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను విద్యార్థులతో వేయించి వాటి ప్రాధాన్యతను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాను, పీడీ శాంతి, జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ఢిల్లీకి మట్టి పంపించేందుకు సన్నాహాలు



సేకరించిన మట్టితో ఎంపీపీ మధుపాడ నాగమణి తదితరులు

సింహాచలం: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నాభూమి–నాదేశం కార్యక్రమంలో భాగంగా పెందుర్తి మండంలో సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఎంపీపీ మధుపాడ నాగమణి తెలిపారు. పెందుర్తి మండలంలోని 15 పంచాయతీల్లోని గ్రామాల్లో మట్టిని కలశాల ద్వారా సేకరించడం జరిగిందన్నారు. ఆ మట్టిని ఒకే కలశంలో భద్రపరిచి ఢిల్లీకి పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు సేకరించిన మట్టిని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంత, ఈవోఆర్డీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోల్‌ప్లే విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సబ్బవరం: పాపులేషన్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాంలో భాగంగా ఉమ్మడి జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన రోల్ ప్లే పోటీల్లో ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ఆ పాఠశాల హెచ్ఎం నాగమల్లేశ్వరరావు తెలిపారు. భీమిలిలోని డైట్‌లో గురువారం రోల్ ప్లే, ఫోక్ డ్యాన్స్ పోటీలు నిర్వహించారన్నారు. రోల్ ప్లేలో ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించిందన్నారు. ఈ మేరకు శుక్రవారం విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు రామలక్ష్మిని మిగిలిన ఉపాధ్యాయులతో కలిసి ఆయన అభినందించారు.

కేజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

దొండపర్తి: రొమ్ము క్యాన్సర్‌పై కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాక్ అంకాలజీ విభాగంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా రేడియోథెరపీ విభాగం 50 మందికి స్క్రీనింగ్ పరీక్ష చేసి క్యాన్సర్‌కు సంబంధించిన కారణాలు, ముందస్తు నిర్ధారణ, చికిత్స విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డులో రోగులకు పళ్లు పంపిణీ చేశారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, అంకాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శిల్ప, రేడియోథెరపీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ పాండురంగకుమారి పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత వైఎస్ జగన్‌దే..



గొల్లపేటలో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పరవాడ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వాడచీపురుపల్లి శివారు గొల్లపేట, దీపాంజలినగర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వారి పొందిన లబ్ధిని గణంకాలతో వివరించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వాడచీపురుపల్లి కూడలిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఇంటి స్థలాలు, అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, విద్యా కానుక, వైఎస్సార్ చేయూత, జగనన్న గోరుముద్ద, పంటల బీమా వంటి సంక్షేమ పథకాలు చేసి జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలనతో పాటు పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. ఆ కార్యక్రమాలే వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, వాడచీపురుపల్లి ఎంపీటీసీ గెద్దం పుష్పాచంద్రారావు, వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు, పార్టీ సీనియర్ నాయకుడు బొంది అచ్చిబాబు, కూండ్రపు తాతాజీ, చరణ్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

పరిశీలించిన అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి , ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఏర్పాట్లపై చర్చిస్తున్న అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శుక్రవారం పరిశీలించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో అరబిందో యాజమాన్యం నిర్మించిన యుజియా(ఈయూజీఐఏ) పరిశ్రమను ఈ నెల 16న సీఎం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీలో ఏర్పాటు చేయనున్న హెలీప్యాడ్ స్థలాన్నిఅనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో చిన్నికృష్ణ పరిశీలించారు. లారస్ ల్యాబ్ యాజమాన్యం ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు భూమి పూజ చేసిన అనంతరం యుజియా పరిశ్రమను ప్రారంభించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, అనకాపల్లి డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్, రాంకీ ఎండీ లాల్‌కృష్ణ, ఆర్డీవో ప్రకాష్, తహసీల్దారు పి.కనకారావు, లారస్ ల్యాబ్ వైస్ ప్రెసిడెంట్ సి.ఎస్.రావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పి.ఎస్.రాజు, వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి వద్ద చప్టా నిర్మాణం



గొల్లగుంటలో బోరు వద్ద నిర్మించిన చప్టా

పరవాడ: మండలంలోని రావాడ శివారు గొల్లగుంటలో పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించారు. తాగునీటి బోరు చుట్టూ ప్లాట్‌ఫారం(చప్టా)ను ఏర్పాటు చేసి పారిశుధ్యాన్ని మెరుగుపర్చడానికి చర్యలు తీసుకున్నామని మండల పంచాయతీ విస్తరణాధికారి రమేష్‌నాయుడు చెప్పారు. బోర్‌వెల్ వద్ద మురుగునీరు నిలిచిపోయి దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నామని ఇటీవల గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ అధికారులు బోరు వెల్ వద్ద నిలిచిపోయిన మురుగునీటిని సమీప కాలువకు మళ్లించి కొత్త ప్లాట్‌ఫారం నిర్మించారు. వీటితో పాటు మరో రెండు బోర్లకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో స్థానికులు సర్పంచ్ ఎం.ఎస్.నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, వార్డు సభ్యులు సైరా బోగం, షేక్ అలీ, జలీల్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

జెడ్సీ మల్లయ్యనాయుడు



వికలాంగుల కాలనీలో ప్రజలకు సూచనలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

సింహాచలం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందవని, సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్–8 జెడ్సీ మల్లయ్యనాయుడు తెలిపారు. 97వవార్డు పరిధి వికలాంగుల కాలనీలో శుక్రవాంం ఫ్రైడ్–డ్రై డే కార్యక్రమాన్ని జోన్–8 అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్సీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు దరిచేరకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అడ్డుకోవచ్చన్నారు. మంచినీటిని రోజుల తరబడి నిల్వ ఉంచరాదని సూచించారు. జ్వరం వస్తే వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం చేయుంచుకోవాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే వాహనాలకు చెత్త అందించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ యూజర్ చార్జీలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కె.వి.రమణ, 97వ వార్డు శానిటర్ ఇన్‌స్పెక్టర్ నాయుడు, మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణమయ్య జయంతి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకాంత కృష్ణమాచార్య(కృష్ణమయ్య) జయంతిని ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానంలో కృష్ణమయ్యకు ఎంతో విశిష్టత ఉంది. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిపై వచన సంకీర్తనలను కృష్ణమయ్య రచించారు. అంతేకాకుండా స్వయంగా ఆయనే పాడి సాక్షాత్తూ లక్ష్మీనృసింహస్వామినే మెప్పించా డు. అంతటి ఘన కీర్తిని గాంచిన కృష్ణమయ్య జయంతిని ఏటా భాద్రపద చతుర్ధశి నాడు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ఆలయ బేడా మండపంలో ఉన్న కృష్ణమయ్య విగ్రహం చెంతన అర్చకు లు జయంతి పూజలు నిర్వహించారు. కృష్ణమయ్య రచించిన వచన సంకీర్తనలను ఆలపించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు, అధ్యాపకులు, ఈపూజలు నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి పూజల్లో పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు శంకుస్థాపన

సింహాచలం: జీవీఎంసీ 97వవార్డు గాంధీనగర్‌లో రూ. 2.50లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి శుక్రవారం వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ శంకుస్థాపన చేశారు. మెంటి మహేష్ మాట్లాడుతూ ఇటీవల గాంధీనగర్‌లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పర్యటించినప్పుడు మంచినీటి సమస్యను స్థానికులు చెప్పడం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పైప్‌లైన్ల నిర్మాణానికి రూ. 2.50లక్షలు కేటాయించారన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి నిర్వాసితులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పైపులైన్లు వినియోగంలోకి వస్తే చినముషిడివాడ ప్రాంతంలో ఉన్న పలు కాలనీలకు స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ నీటి సరఫరా ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు విజయలక్ష్మి, రాంబాబు, బాబ్జి, నాయుడు, కాలనీ నిర్వాసితులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

వైస్ ఎంపీపీ గోవింద్



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ గోవింద్ తదితరులు

సబ్బవరం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే మెరుగైన వైద్యం అందుతుందని వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ అన్నారు.మండలంలోని పైడివాడ అగ్రహారం సచివాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్య సేవలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన స్టాల్‌ను పరిశీలించారు. శిబిరంలో 545 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా పరిశీలకులు డాక్టర్ కిశోర్ కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, ,నాయకులు పెచ్చేటి రమేష్ నాయుడు,కనకరాజు పాల్గొన్నారు.

21న అక్షర గాయత్రీ మాతల ప్రదర్శన

సింహాచలం: ఈ నెల 21న చినముషిడివాడ దరి శ్రమశక్తినగర్‌లోని శ్రీ పంచముఖి గాయత్రీ ఆలయంలో 24 అక్షర గాయత్రీ మాతల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు నాట్య కళాకారిణి విజయజ్యోతి శుక్రవారం తెలిపారు. 24 మంది నృత్య విద్యార్థులతో 24 ముఖ వర్ణాలతో, 24 అలంకారాలతో ఈ ప్రదర్శన ఉంటుందని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

బహుభాషా కోవిదుడు జోస్యుల సూర్యప్రకాశరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగంలో ఆచార్య జోస్యుల సూర్యప్రకాశరావు సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సీనియర్ ఆచార్యులు జి.యోహాన్‌బాబు మాట్లాడుతూ ఆచార్య జోస్యుల సూర్యప్రకాశరావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి వార్డెన్‌గా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌గా పని చేసి గుర్తింపు పొందారన్నారు. జోస్యుల బహుభాషాకోవిదులని, దాదాపు 12 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరన్నారు. సంస్కృతం, తెలుగు భాషలతో పాటు హిందీ లోను సాధికారంగా పట్టు సాధించిన జోస్యుల మంచి సాహిత్యాన్ని సృష్టించారన్నారు. నవ సాహితి ఇంటర్నేషనల్ చెన్నై సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ గురువులను స్మరించుకోవడం వారి మీద ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు ఆచార్యులు డాక్టర్ సీతారత్నం, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ బి.వెంకటస్వామి, డాక్టర్ కె.రత్నశేఖర్, డాక్టర్ పి.లావణ్య, ఎ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కో–ఆపరేటివ్ బంక్‌లో వివాదం

- పెట్రోల్ నాణ్యతపై నిలదీసిన ఉద్యోగులు
- పరీక్షలతో సద్దుమణిగిన వైనం



బాటిల్‌లో నింపిన పెట్రోల్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కో–ఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంక్‌లోని పెట్రోల్‌పై శుక్రవారం వివాదం చెలరేగింది. పెట్రోల్‌లో నీళ్లు కలిపి నాణ్యత లేని పెట్రోల్ అమ్ముతున్నారని కొంతమంది ఉద్యోగులు చేసిన ఆరోపణలు ప్లాంట్ వాట్సప్‌ల్లో హల్‌చల్ చేయగా.. పాలకవర్గం ప్రతినిధులు రంగంలో దిగి వారి ఆరోపణలపై వివరణ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఒకరు ఉదయం బంక్‌కు వెళ్లి బాటిల్‌లో పెట్రోల్ కొట్టించగా పెట్రోల్ రంగు కొద్దిగా మారి ఉండటంతో నీళ్లు కలిపారంటూ హడావుడి చేశారు. దానికి కొంతమంది మద్దతు ఇవ్వడంతో బంక్ సిబ్బందిని నిలదీశారు. రెండు రోజుల పాటు వచ్చే పెట్రోల్ రంగు, రుచిలో కొద్దిపాటి తేడా ఉంటుందని హెచ్‌పీసీఎల్ అధికారులు తెలిపారని చెప్పారు. ఉద్యోగులు దానిని అంగీకరించక.. ఫిల్టర్ పేపర్‌తో తనిఖీ చేసి చూపాలంటూ డిమాండ్ చేశారు. సిబ్బంది ఫిల్టర్ పేపర్ తెచ్చి చూపినా ఉద్యోగులు శాంతించలేదు. ఈ విషయం తెలిసి కో–ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు బి.టి. జగదీష్, డైరెక్టర్ నాగబాబు వచ్చి హెచ్‌పీసీఎల్ అధికారులు పంపిన సమాచారాన్ని సభ్యులకు చూపించారు. నాణ్యత కలిగిన పెట్రోల్ సాంద్రత 700 పైగా ఉండాల్సి ఉండగా బంక్ పెట్రోల్ సాంద్రతను పరీక్షించగా 741.8 వచ్చింది. దీంతో ఉద్యోగులు శాంతించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- జెడ్పీటీసీ పీఎస్‌రాజు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ పీఎస్ రాజు

పరవాడ: పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పిలుపునిచ్చారు. భర్నికం సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ పి.ఎస్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరుపేదల పాలిట ఓ వరమన్నారు. వైద్య శిబిరంలో 315 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌వో)హేమంత్‌కుమార్, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, వీఆర్వో శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమంతోనే కేంద్రానికి గుణపాఠం



శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతోనే కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా గుణపాఠం నేర్పుతామన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 974వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న లక్ష్యానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని, సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఉక్కు ఉద్యమ సెగ దేశవ్యాప్తంగా వెళ్లిందన్నారు. దీనికి మద్దతుగా కార్మికులంతా పెద్ద ఎత్తున ఉక్కు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



గురుకులంలో విద్యార్థులు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న డీసీ రూపావతి

ఆరిలోవ: పూణేలోని కళాభారతి చైల్డ్ ఆర్ట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గురుకులం విద్యార్థులకు ఇటీవల జాతీయ స్థాయి ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు ప్రతిభ కనకబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఆర్ట్స్ అండ్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడిని శుక్రవారం గురుకులాల జిల్లా సమన్వయాధికారి శంబాన రూపావతి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 65 మంది గురుకులం విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వారు వేసిన పెయింటింగ్స్‌ను ఆన్‌లైన్‌లో కళాభారతి చైల్డ్ ఆర్ట్ డెవెలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించామని తెలిపారు. ఏడో తరగతి విద్యార్థి విజయ్, ఎనిమిదో తరగతి విద్యార్థి స్టీవెన్‌సన్, తొమ్మిదో తరగతి విద్యార్థి లోకేష్, పదో తరగతి విద్యార్థి రాజ్‌కుమార్ ప్రతిభ కనబరిచి, కళా గౌరవ పురస్కారం దక్కించుకున్నారు. మిగతా 61 మంది విద్యార్థులకు ప్రోత్సాహక సరిఫికెట్లు లభించాయి. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆర్ట్స్ ఉపాధ్యాయుడు పి.సుధాకర్‌కు కళా భూషణ్ అవార్డు లభించిందన్నారు.

దేశాన్ని, సంస్కృతిని గౌరవించాలి

దాబాగార్డెన్స్ : భారతీయులంతా దేశాన్ని ప్రేమించి, భారతీయ సంస్కృతిని గౌరవించాలని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పిలుపునిచ్చారు. కళాశాలలో శుక్రవారం మేరా మట్టి.. మేరా దేశ్ కార్యక్రమం చేపట్టారు. దేశం కోసం అమరులైన స్వాతంత్ర్య సమరయోధులు, జవాన్లను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ప్రముఖ పాత్ర పోషించిన సమరయోధులను, సరిహద్దుల్లో కాపలా కాసే సైనికులను ఎప్పుడూ గుర్తించుకోవాలన్నారు. మట్టిని నమ్ముకున్న రైతన్నను గౌరవించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా ‘నా దేశం–నా మట్టి’

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నా దేశం–నా మట్టి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ సేవా పథకం విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రారంభించారు. వర్సిటీ నుంచి సేకరించిన మట్టిని విద్యార్థుల సమక్షంలో అమృత కలశంలో వేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువతలో సమైక్య భావన, దేశ భక్తిని పెంచే విధంగా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఎంతో పవిత్ర భావంతో జాతీయ సేవా పథకం యూనిట్ల నుంచి వివిధ ప్రాంతాల నుంచి మట్టిని సేకరించి, దేశ రాజధానికి పంపుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శైలజ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.


తోపుడుబండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్

మద్దిలపాలెం : చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. చిరు వ్యాపారులతో శుక్రవారం పిఠాపురం కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో హ్యాకర్ల జోన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలన్నారు. జీవీఎంసీ అధికారులు నిరంతరం చిరు వ్యాపారులపై దాడులు చేస్తూ జీవనోపాధికి భంగం కలిగిస్తున్నారన్నారు. వెంటనే హ్యాకర్ల జోన్‌లు ఏర్పాటు చేస్తే ఈ సమస్య పునరావృతం కాదన్నారు. దీనిపై ఈనెల 20వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. నవంబర్ 15న చలో జీవీఎంసీ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిరువ్యాపారుల ప్రతినిధులు సింహాచలం, పి.వెంకటరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటేనే అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

దాబాగార్డెన్స్ : విద్యార్థులకు నైపుణ్యం చాలా ముఖ్యమని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి అభిప్రాయపడ్డారు. శుక్రవారం కళాశాల ఐక్యూఏసీ, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రొగ్రాం ఫర్ పొటెన్షియల్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నైపుణ్యం ద్వారా జీవితంలో వచ్చే అనేక సమస్యలు సులభంగా పరిష్కరించుకోగలమన్నారు. అనంతరం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ స్త్రీలు తమకున్న నైపుణ్యాలను వ్యాపారంలో పెట్టుబడిగా పెడితే అద్భుతాలు సాధించగలరని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ దేవిడ్‌రాజు కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, అనురాధ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.